ప్రజాశక్తి
గురువారం 14 నవంబరు 2024
5
శ్రీకాకుళం

ఎఎస్‌పిగా కె.వి రమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా కె.వి రమణ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఎఎస్‌పిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం జిఒ నంబరు 1127ను బుధవారం విడుదల చేసింది. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయన్ను అడిషనల్ ఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చింది. ఇప్పటివరకు అడిషనల్ ఎస్‌పిగా పనిచేసిన టి.ప్రభాకరబాబును పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

ప్రజా సమస్యలపై పోరు

- వినియోగదారులపై ఇంధన సర్దుబాటు ఛార్జీలు
- ఊరూరా బెల్టుతో ఏరులై పారుతున్న మద్యం
- సామాన్యులకు దొరకని ఉచిత ఇసుక
- నేడు జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజా సమస్యలపై పోరుకు సిపిఎం నడుంబిగించింది. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, ప్రజలపై భారాలు మోపేందుకు సిద్ధమవుతోంది. ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో వచ్చే నెల నుంచి విద్యుత్ ఛార్జీలను పెంచబోతోంది. నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణ తప్పుతోంది. ఉచిత ఇసుక పేరుతో విపరీతంగా దోపిడీ సాగుతోంది. సామాన్యులకు ఉచిత ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. లిక్కరు దుకాణాలకు లైసెన్స్ దక్కించుకున్న వ్యాపారులు కూటమి నాయకుల అండతో బెల్టు దుకాణాలకు తెరతీయడంతో మద్యం ఏరులై పారుతోంది. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రజా పోరులో భాగంగా జిల్లావ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాల్లో గురువారం ధర్నాలు చేపట్టనుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వచ్చే నెల నుంచి విద్యుత్ ఛార్జీలు పెరగనున్నాయి. విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.8,114 కోట్ల భారం మోపేందుకు సిద్ధమవుతోంది. అందులో జిల్లాకు సంబంధించి రూ.వంద కోట్ల మేర ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఏడాదిలో వాడిన కరెంట్‌ను లెక్కించి వాటి సరాసరి యూనిట్లపై విద్యుత్ ఛార్జీలను వసూలు చేయనున్నారు. ఇక నుంచి ఒక నెలలో వాడిన కరెంట్‌తో పాటు అదనంగా సగటు యూనిట్ల వాడకం కరెంటు కలిపి బిల్లులు జారీ చేస్తారు. దీంతో బిల్లులు తడిపిమోపెడు కానున్నాయి. జిల్లాలో మొత్తం 9,23,416 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 7,89,151 గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు, 76,476 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 3,067 పరిశ్రమలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వీధిదీపాలు, రక్షిత మంచినీటి కనెక్షన్లు 22,154 ఉన్నాయి. విద్యుత్ ఛార్జీల రూపేణా ప్రతి నెలా సగటున రూ.వంద కోట్ల వరకు ఇపిడిసిఎల్‌కు ఆదాయం సమకూరుతోంది. ఇంధన సర్దుబాటు ఛార్జీలు విధించనున్న నేపథ్యంలో మరో రూ.ఎనిమిది కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. గృహ వినియోగదారులతో పాటు గ్రానైట్, జీడి పరిశ్రమలతో పాటు చిన్నచితకా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలపై తీవ్ర భారం పడనుంది. వీటితో పాటు జిల్లాలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే పనిని ప్రభుత్వం వేగవంతం చేసింది.

సామాన్య ప్రజలకు దొరకని ఉచిత ఇసుక

ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంతో సామాన్య ప్రజలు కంటే బిల్డర్లు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలే ఎక్కువ లబ్ధి పొందుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రారంభంలో జిల్లాలోని రీచ్‌ల ద్వారా లభ్యమయ్యే ఇసుకను ఇక్కడి అవసరాలకే వినియోగించాలని పేర్కొంది. తర్వాత దాన్ని పొరుగు జిల్లాల వారూ ఇసుక తీసుకెళ్లొచ్చని ప్రభుత్వం సడలించడంతో, విశాఖలోని పలు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ఇష్టానుసారంగా విశాఖకు ఇసుకను తరలించాయి. జిల్లాలో బూరవెల్లి, ఆమదాలవలస రీచ్‌లను ఏకంగా విశాఖ భవన నిర్మాణ సంస్థలకే కేటాయించడంతో, సమీప ఒడ్డునే ఉన్న స్థానిక ప్రజలు గుప్పెడు ఇసుకను అక్కడ్నుంచి స్థానికులు తీసుకెళ్లే అవకాశం లేకుండా చేశారు. ఇసుక కోసం వారు కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని వేరే రీచ్‌ల నుంచి తెచ్చుకుంటున్నారు. ఇసుక ఓవర్ లోడింగ్‌పై గతంలో కేసులు నమోదు చేసే పరిస్థితి ఉండగా వాటిని ఎత్తేస్తూ, ప్రభుత్వం భవన నిర్మాణ సంస్థలకు మరో వెసులుబాటు కల్పించింది. కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, బిల్డర్లకు ప్రభుత్వం మరో ఆఫర్ కూడా ఇచ్చింది. ఇసుకపై సీనరైజ్, జిఎస్‌టి తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇసుక పాలసీ వచ్చే లోపు జిల్లాలోని అన్ని రీచ్‌ల్లోని ఇసుకను అనధికారికంగా విశాఖకు తరలించేశారు. టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులే వెనుకుండి ఈ తతంగం సాగించారంటూ తీవ్ర విమర్శలు వచ్చాయి. విశాఖకు అనధికారికంగా మూడు లక్షల టన్నుల వరకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

ఊరూరా బెల్టుతో ఏరులై పారుతున్న మద్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చింది. అందులో భాగంగా లాటరీ పద్ధతిన జిల్లాలో 158 మద్యం దుకాణాలకు లైసెన్స్‌లను జారీ చేసింది. కోట్ల రూపాయలను పెట్టుబడిగా పెట్టిన వ్యాపారులు లాభాలను ఆర్జించడానికి బెల్టుకు మద్యం సరఫరా చేయడం మొదలుపెట్టారు. బెల్టు షాపులను దక్కించుకోవడానికి గ్రామాల్లో ఏకంగా వేలం పాటలు పెడుతున్న పరిస్థితి నెలకొంది. ఎచ్చెర్ల నియోజవర్గం రణస్థలం మండలంలోని పాతర్లపల్లిలో బెల్టు షాపు నిర్వహణకు ఏడాదికి రూ.16 లక్షలు నిర్ణయించినట్లు తెలిసింది. లావేరు మండలం సుభద్రాపురంలో బెల్టు షాపు నిర్వహణకు రూ.3.65 లక్షలు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా పాటలు పూర్తి చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. గార మండలం జొన్నలపాడులో రెండేళ్ల పాటు బెల్టు షాపు నిర్వహించడానికి గ్రామ పెద్దల సమక్షంలో ఏకంగా ఒప్పందం చేసుకుంటున్న విషయం బట్టబయలైంది. ఇచ్ఛాపురం, సోంపేట తదితర మండలాల్లోని పలు గ్రామాల్లోనూ బెల్టు షాపులకు వేలం పాటలు పెట్టారు. బెల్టు దుకాణాల విషయంలో చాలా గ్రామాల్లో కూటమి, వైసిపి అంతా ఒక్కటైపోయారు. కూటమి నాయకుల అండదండలు ఉండడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో బెల్టు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా మారింది.

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు

ధరలను నియంత్రిస్తామని ప్రభుత్వం చెప్తున్నా, కొన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలు అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్నాయి. ప్రధానంగా వంట నూనెలు కాగుతున్నాయి. మూడు నెలల కిందట పామాయిల్ రూ.90 ఉండగా, ప్రస్తుతం రూ.130కు పెరిగింది. ఆధార్ ఆయిల్ రూ.110 నుంచి రూ.135కు, ఫ్రీడం ఆయిల్ రూ.115 నుంచి రూ.140కు పెరిగింది. టమోటా కేజీ రూ.50 ఉండగా, ఉల్లి రూ.60 వరకు చేరింది. రేషన్ ద్వారా నిత్యావసర వస్తువులను అందిస్తే కొంతవరకు ధరలు తగ్గుముఖం పట్టేవి. ఏడాది కాలంగా కందిపప్పు, ఆరు నెలలుగా పంచదార ఇవ్వడం మానేశారు. నవంబరులో మాత్రం బియ్యం, పంచదార, కందిపప్పు ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే అన్నిరకాల నిత్యావసర సరుకులను అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదు.

‘తీపి’ శత్రువు

- పెరుగుతున్న మధుమేహ వ్యాధిగ్రస్తులు
- అధికమవుతున్న దుష్ఫలితాలు
- నేడు ప్రపంచ మధుమేహ దినం

మధుమేహం (సుగర్) చాప కింద నీరులా విస్తరిస్తూ పంజా విసురుతోంది. మనకు తెలియకుండా శరీరంలోని అవయవాలను క్షీణింపజేస్తోంది. అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. ఏమాత్రం అప్రమత్తత లేకపోయినా జీవితంలోని తీపి మాధుర్యాన్ని దూరం చేస్తుంది. ప్రతి ఐదుగురిలో ఒకరికి ఈ వ్యాధి ఉందంటే దీని తీవ్రత ఏమేరకు ఉందో అర్థం చేసుకోవాలంటున్నారు వైద్య నిపుణులు. నేడు ప్రపంచ మధుమేహం దినం సందర్భంగా ‘అడ్డంకుల బద్దలు-అంతరాలను తగ్గించడం’ అనే నినాదంతో ఈ ఏడాది అవగాహనా కార్యక్రమాలను చేపట్టనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మధుమేహ వ్యాధి రావడానికి జీవనశైలి ప్రధాన కారణం. ముఖ్యంగా పని ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవడం, జంక్ ఫుడ్, సమయపాలన లేని భోజనం కారణాలు. జన్యుపరంగానూ ఈ వ్యాధి సంక్రమిస్తుంది.

డయాబెటిస్ రకాలు

అన్నిరకాల మధుమేహాలకు మూల కారణం క్లోమగ్రంథిలోని బీటా కణాలు పెరిగిన గ్లూకోజ్ స్థాయిని అరికట్టడానికి సరిపడా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోవడమే. ఈ వ్యాధి మూడు రకాలు. మొదటిది టైప్-1 డయాబెటిస్. ఇది చిన్న పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఇన్సులిన్ తయారీ వారిలో తగ్గిపోవడం వల్ల ఇది వస్తుంది. రెండోది టైప్-2 డయాబెటిస్. ఇందులో ఇన్సులిన్ ఉత్పత్తి జరిగినా, దాన్ని శరీరం వినియోగించుకోలేదు. 90 శాతం మందిలో ఈరకం డయాబెటిస్ కనిపిస్తోంది. మూడోది జెస్టేషనల్ డయాబెటిస్. గర్భిణుల్లో కొంతమందికి ప్రసవం ముందు ఇది వస్తుంది. ప్రసవం తర్వాత గ్లూకోజ్ స్థాయి మామూలు స్థితికి వస్తాయి.

వైద్య పరీక్షలు

మన శరీరంలో చక్కెర స్థాయిలు పరగడుపున 120, భోజనం తర్వాత 160 మించకుండా ఉండేలా చూసుకోవాలి. మూడు నెలల చక్కెర స్థాయిలు (హెచ్‌బిఎ1సి) 7 శాతం కంటే తక్కువ ఉండేలా చూడాలి. మధుమేహ వ్యాధి నిర్ధారణ అయితే జీవితాంతం మందులు, స్థాయిని బట్టి ఇన్సులిన్ ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేస్తుంటే మాత్రల డోసు పెంచాల్సిన అవసరం ఉండదు. లేకుంటే మందుల డోసు పెంచుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. రోగి పరిస్థితిని బట్టి ఏ ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇవ్వాలనేది వైద్యులు నిర్ణయిస్తారు.

పెరుగుతున్న దుష్ఫలితాలు

ప్రస్తుతం రెండు పదుల వయసులోనే మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆ వయసులో సుగర్‌కు ఉన్న దుష్ఫలితాలు పెద్దగా కనిపించకపోవడంతో యువత మందులు వాడేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో కొన్నేళ్లు గడిచేసరికి ఆ ప్రభావం గుండె, మెదడు, రక్తనాళాలతో పాటు కిడ్నీలపై చూపుతోంది. అప్పుడు మేలుకున్నా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇటీవల కాలంలో 30 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు గల వారు గుండెపోటు, పక్షవాతం, కిడ్నీలు పాడవుతున్న వారి సంఖ్య పెరిగినట్లు వైద్యులు చెప్తున్నారు. అందుకు అదుపులో లేని మధుమేహమే ప్రధాన కారణమని వారు స్పష్టం చేస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవడానికి కొన్ని జాగ్రత్తలు దినచర్యలో భాగంగా మార్చుకోవాలి. రోజూ కనీసం అరగంట పాటు నడవాలి. వారంలో నాలుగు నుంచి ఐదు రోజులైనా వ్యాయామం చేయాలి. దుంపకూరలు తినకూడదు. కొబ్బరినీళ్లు తాగకూడదు. ఆపిల్, బత్తాయి, జామ, బొప్పాయి, కమలాపళ్లు తినవచ్చు. మితాహారం తీసుకుంటూ కొవ్వు పదార్థాలు అధికంగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. పామాయిల్, వనస్పతి, కొబ్బరి నూనెలను వాడకూడదు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు మానేయాలి.

అప్రమత్తంగా ఉండాలి

మధుమేహం వ్యాధి వచ్చే అవకాశమున్న హైరిస్క్ వాళ్లు ప్రీ డయాబెటిస్ దశలోనే అప్రమత్తం కావాలి. మధుమేహం వ్యాధి బయటపడే నాటికే పదేళ్ల నుంచి అంతర్లీనంగా హెచ్చుతగ్గులు ఉండవచ్చు. అందుకే సుగర్ దుష్ఫలితాలు అవయవాలపై చూపాయేమో స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఒకరికి సుగర్ వస్తే, మిగిలిన వారు అప్రమత్తం కావాలి. సమతుల్య ఆహారం, శ్రమ గల జీవన విధానంతో వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు.

- డాక్టర్ కింజరాపు షర్మిల
మధుమేహ వైద్య నిపుణులు, శ్రీకాకుళం

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. గంజాయి వినియోగం, రవాణా, సైబర్ మోసాలు, మహిళలు, చిన్న పిల్లలపై వేధింపులు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై జిల్లా పోలీసు కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాశాలల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ అంశాలపై పోలీసు శాఖ జిల్లాలో చేపడుతున్న అవగాహనా కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వారి నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి కట్టడి, మహిళలు, చిన్న పిల్లలపై వేధింపులు, సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని తెలిపారు. మూడు నెలలుగా ఎక్కువ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు వివరించారు. మైనర్లపై ప్రేమ పేరిట ప్రలోభ పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. విద్యాసంస్థల్లో బాలికలపై తప్పుగా ప్రవర్తించడం, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ లేకుండా చూడాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు నివారణకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంకల్పం పేరిట ప్రత్యేక కార్యాచరణతో కళాశాలలు, పాఠశాలలు, గ్రామీణ పట్టణ, ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. పలురూపాల్లో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, దీనివల్ల నగదును పోగొట్టుకుంటున్నారని తెలిపారు. సమావేశంలో డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, రాజశేఖర్, సిఐలు ఇమాన్యుయేల్ రాజు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, అంబేద్కర్ యూనివర్సిటీ నోడల్ అధికారి సంధ్య, ఆర్‌ఐఒ టి.దుర్గారావు, డివిఇఒ బి.తవిటినాయుడు, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇలియాక్త అలీఖాన్, పలు కళాశాలలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో బాలికల్లో రక్తహీనత ప్రమాదకర స్థాయికి చేరుకుంటోందని, జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారందరినీ ఆరోగ్యవంతులని చేసే బాధ్యతను తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం అమలుపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల రక్తనమూనాలు సేకరించి వారిలో హిమోగ్లోబిన్ శాతం, ఎత్తు, బరువు కొలిచి రక్తహీనత ఉన్న వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఇకపై తరచూగా హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ ఏడాది డ్రాపౌట్ విద్యార్థినుల సంఖ్య 2,245గా నమోదు కావడం ఆందోళనకరమన్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేని పాఠశాలల వివరాలు అందజేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఆడ పిల్లల జననాలు తక్కువగా నమోదవుతున్న ఆస్పత్రులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతి శ్రీ బేటీ బచావో - బేటి పడావోపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అత్యవసర ఫోన్ నంబర్లు, కిశోర బాలికా వికాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమ్మె నోటీసు అందజేస్తున్న 108 యూనియన్ నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్ వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న ఇఎంటి, పైలట్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 25వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు 108 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు విజయ్ మోహన్ తెలిపారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను బుధవారం కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అంతకుముందు డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ఎఒ భాస్కరకుమార్‌కు నోటీసును అందజేశారు. 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థల మార్పు జరిగిన ప్రతిసారీ ఉద్యోగుల గ్రాట్యుటీ, ఇఎల్ అమౌంట్ చెల్లించకుండానే వైదొలగడం వల్ల ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. 2017లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన 49 జిఒ ద్వారా 108లోని ప్రతి ఉద్యోగికి ప్రతి నెలా రూ.నాలుగు వేలు నేరుగా చెల్లించేవారని, గత ప్రభుత్వం దాన్ని రద్దు చేసి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ జిఒను పునరుద్ధరించాలని కోరారు. వైద్యారోగ్యశాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డి.ఎం.ఇ) ద్వారా అన్ని వైద్య కళాశాలల్లో చేపడుతున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇ.ఎం.టి) పోస్టులకు నిర్ధారించిన విద్యార్హత కలిగిన అభ్యర్థులు భర్తీ కావడం లేదన్నారు. విద్యార్హతలు సడలించి 108 సర్వీసులో ఇప్పటికే ఇఎంటిలుగా పనిచేస్తున్న వారి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎఐఎంఎస్ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉద్యోగులకు ప్రతి నెలా జీతాల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, దాన్ని నివారించి సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. నోటీసు అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ఈశ్వర్, శ్రీను, మురళి, చిన్నబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గ్రంథాలయాల విశిష్టతను తెలియజేసేలా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన ముద్రించిన పోస్టర్, కరపత్రాలను కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు. తొలుత జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు ఆహ్వాన పత్రికను అందజేశారు. వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంతో పాటు బాలల దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు, పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు పలు పోటీలు నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనం, గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

రజక కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఇద్దరికి చోటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం మరో విడత కార్పొరేషన్లకు డైరెక్టర్లను బుధవారం నియమించింది. అందులో రజక కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లాలో ఇద్దరికి చోటు దక్కింది. పలాస నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు గురజాపు రామును నియమించారు.

మందస ఎస్ఐ సస్పెన్షన్

శ్రీకాకుళం ప్రతినిధి : మందస ఎస్ఐ ఖాదర్ భాషాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగానే వేటు వేసినట్లు తెలిసింది.

నేత్రపర్వం.. నావికోత్సవం

హంస వాహనాలపై విహరించిన ఆదిత్యుడు, కూర్మనాథుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్ / గార

జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రాలు అరసవల్లి, శ్రీకూర్మంలో క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన హంస నావికోత్సవం (తెప్పోత్సవం) నేత్రపర్వంగా సాగింది. ఆదిత్యుడు ఇంద్ర పుష్కరిణిలో, కూర్మనాథుడు శ్వేతపుష్కరిణిలో హంస వాహనాలపై విహరించారు. వేలాది మంది యాత్రికులు ఈ అద్భుత దృశ్యాలను తిలకించారు. అరసవల్లిలోని ఇంద్రపుష్కరిణిలో ఉషా, ఛాయా, పద్మినీ సమేత సూర్యనారాయణస్వామి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను మేళ తాళాలతో ఇంద్రపుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. హంసనావపై ఉంచి.. ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాన్ని ప్రారంభించారు. పుష్కరిణిలో 12సార్లు ప్రదక్షిణలు నిర్వహించారు. పుష్కరిణిలో యాత్రికులు దీపారాధనలు చేశారు. తెప్పోత్సవం అనంతరం యాత్రికులు బంగారు ఆభరణాలతో అలంకరించిన స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అనివెట్టి మండపంలో క్షీరాబ్ధివ్రతం, మంత్రపుష్పం, అర్చన, అటుకుల నివేదన, విన్నపాలు, నక్షత్ర దీపారాధన, నీరాజనం సమర్పించారు. డిఎస్‌పి సిహెచ్.వివేకానంద్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో..

గార మండలం శ్రీకూర్మంలో కూర్మనాథుని తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పల్లకిలో ఇందిరా, వసుమతి, చక్ర నారాయణుల విగ్రహాలను ఆలయ ప్రధాన అర్చకులు, ఇతర అర్చకుల సమక్షంలో మేళతాళాలతో తిరువీధి నిర్వహించారు. అనంతరం శ్వేతపుష్కరిణిలో కూర్మనాథుడిని మూడుసార్లు విహరింపజేశారు. పుష్కరిణి మధ్యలో ఉన్న నరసింహస్వామికి హారతులు సమర్పించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు పెద్దసంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. ఆలయ ఇఒ జి.గురునాథరావు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకలు పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు టెక్కలి
OS.55/2023

Between:-
శిర్ల పార్వతి వగైరాలు ....వాదులు
And:
శిర్ల శ్యామసుందరరావు వగైరాలు ....ప్రతివాదులు

To:
3వ ప్రతివాది: బోనెల చంద్రకళ, W/o లింగరాజు, D/o లేటు శిర్ల చంద్రయ్య, 45 సంవత్సరములు, చిన్నబాడాం గ్రామం, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటి శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు OS.55/2023 దావాలోగల వాదులు, ప్రతివాదులు పై Partition దావా దాఖలు చేయగా, సదరు OS.55/2023 నెంబరు దావా **తే 28-11-2024దిన పైకోర్టులో వాయిదా అయిఉన్నది.** ఆదినమున 3వ ప్రతివాది పై కోర్టులో ఉదయం 10-30 గంటలకు స్వయంగా గాని, లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసు కొనవలయును. లేని ఎడల సదరు దావా OS.55/2023ను మీ పరోక్షమందు విమర్శించి తీర్మానించడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

పేడాడ బాబూరావు
వాదులు తరుపున న్యాయవాది,
టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
D.O.P. No.1451/2022

బిట్వీన్:
మేకల విజయ్. ....పిటీషనరు
మరియు
మేకల @ బుక్కురు స్వప్న. ...రెస్పాండెంటు

To,
శ్రీమతి మేకల @ బుక్కురు స్వప్న, భర్త.మేకల విజయ్, సాకిన్: వీరఘట్టం గ్రామం, దుర్గిపేట (మం), శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు D.O.Pని పిటీషనరు, రెస్పాండెంట్ తో జరిగిన వివాహమును రద్దు పరచి,విడాకులు ఇప్పించమని కోరుచూ దాఖలు చేయగా సదరు ఒ.పి.లో రెస్పాండెంట్ అయిన మీరు నోటీసులు తీసు కొనక కాలయాపన చేయుచున్నందున మీ నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:03-12-2024కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ.గం. 10-30 ని.ల.కు మీరు స్వయంగా గాని,మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను.లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:03-12-2024

నామాల శ్రీనివాస రావు,
పిటీషనరు తరపు న్యాయవాది,
గుంటూరు, సెల్.7032136147

IN THE HONOURABLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT SRIKAKULAM
O.S.No. 97/2016.

Between:
Mosa Rajababu. ....Plaintiff
And:
Mosa Rama Rao and others. .....Defendants.

To,
D-9: Korada Chandra Kumari, W/o late Govinda Rajulu, aged 61years, R/c 2-354.. Korada Veedhi, Srikurmam Village & Post, Gara Mandal, Srikakulam district.
D-10: Korada Santosh Kumar, S/o late Govinda Rajulu, aged 41years, R/c 2-354.. Korada Veedhi, Srikurmam Village & Post, Gara Mandal, Srikakulam district.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 19-11-2024 న ఉదయం: గం॥10-30 ని॥** లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

పి.యస్. గాంధీ
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9848063543.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి అప్పారావు

ప్రజలతో మమేకం కావాలి

కాశీబుగ్గ డిఎస్‌పి వి.వి అప్పారావు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

మండలంలోని ప్రతి గ్రామాన్నీ తరచూ సందర్శించి ప్రజలతో మమేకం కావాలని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఈ మేరకు కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ కె.నిహార్ మండలంలోని స్థితిగతులు, రాజకీయ ప్రాధాన్యత, నేతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజలతో తత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. రోడ్డు భద్రతా చర్యలు, మాదక ద్రవ్యాలు నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి ఫిర్యాదు దారులతో కాసేపు ముఖాముఖిగా మాట్లాడారు.

విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కబడ్డీ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - నౌపడ

బాపట్లలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో జిల్లా బాలురు, బాలికలు కబడ్డీ జట్లు విజేతగా నిలిచాయి. ఈ మేరకు పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు, నాయకులు బుధవారం అభినందనలు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు చిరుపాన గౌరీస్వరూప్, గిన్ని శంకర్‌రెడ్డి, బాలికల విభాగంలో కోట వసుంధర జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. పోటీల్లో సత్తా చూపిన పాఠశాల విద్యార్థి గౌరీస్వరూప్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్.జనార్ధనరావు, పిఇటి శ్యామ్ కాంతారావు తెలియజేశారు. అలాగే అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కడప జిల్లా రాయచోటిలో బాలికల విభాగంలో ఖగేశ్వరి, పవిత్ర ద్వితీయ స్థానం కైవసం చేసుకుని జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించారు. వీరిని ప్రధానోపాధ్యాయులు ఎం.భానుప్రకాష్, ఉపాధ్యాయుల గోపాలకృష్ణ, బిగ్ హెల్ప్ నౌపడ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.జయకృష్ణారెడ్డి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

అందుబాటులోకి మరో పాసింజర్ రైలు

కవిటి: రైల్వే ప్రయాణికులకు రైల్వేశాఖ శుభవార్త చెప్పిందని జడ్ఆర్‌యుసిసి మెంబర్ శ్రీనివాస రౌలో ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ జనసాధారణ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో అలసత్వం

- ఇక్కట్లు పాలవుతున్న విద్యుత్ వినియోగదారులు
- దృష్టిసారించని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని ఉప ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీస్ (ఇఆర్ఒ)లో విద్యుత్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తుండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కార్యాలయానికి వచ్చే విద్యుత్ వినియోగదారులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఆమదాలవలస సబ్ ఇఆర్ఒ పరిధిలో బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస రూరల్, అర్బన్ ఉన్నాయి. ఈ నాలుగు సెంటర్ల పరిధిలో సుమారు 50 వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లున్నాయి. గతంలో ఈ ఇఆర్ఒ పరిధిలో సిబ్బంది అధికంగా ఉన్నారని, అప్పటి సిఎండి ఇక్కడ ఉన్న సిబ్బందిని సెక్షన్ ఆఫీసులకు బదిలీ చేసినప్పటికీ సిఎండి ఆదేశాలను బేఖాతరు చేస్తూ మరో ముగ్గురికి ఇక్కడ ఇటీవలే బదిలీల్లో భాగంగా అదనంగా నియమించినట్లు తెలుస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఉన్నతాధికారుల మాట వినకుండా నిత్యం గొడవలు పడుతూ, విధులకు డుమ్మా కొడుతూ, అప్పుడప్పుడు బిల్లులు కట్టించుకోకుండా కౌంటర్లు కూడా మూసేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

ఈనెల 5న విద్యుత్ మహిళా ఉద్యోగులు గొడవలు పడి జిఆర్‌సి కౌంటర్ మూసివేయడంతో బిల్లులు చెల్లించడానికి విద్యుత్ కార్యాలయానికి వచ్చిన వినియోగదారులు అసౌకర్యానికి గురయ్యారు. కలెక్షన్ కౌంటర్ సమయానికి తెరవరని, నిత్యం ఉద్యోగులు గొడవలు పడుతూనే ఉంటారని వినియోగదారులు చెబుతున్నారు. బిల్లులు చెల్లించడానికి వచ్చిన తాము గంటల కొద్దీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సంతోషిమాత అనే మహిళా ఉద్యోగి నిత్యం ఫోన్ మాట్లాడుతూ కాలక్షేపం చేస్తూ ఉంటుందని, ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు చేతనైంది చేసుకోండంటూ వినియోగదారులపై దురుసుగా ప్రవర్తిస్తూ ఉంటుందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. గతంలో ఈమె మరో మహిళా ఉద్యోగి ఇలాగే కార్యాలయంలో గొడవపడి పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న సంఘటనపై అప్పట్లో 'ప్రజాశక్తి' పత్రికలో ప్రచురించినప్పటికీ అప్పట్లో అధికారులు, విద్యుత్ యూనియన్ నాయకులు ఇరువురిని శాంతింప చేసి కేసు లేకుండా రాజీ చేశారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు గుర్తు చేస్తున్నారు. సంతోషిమాత అనే ఉద్యోగి తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ, రహదారిపైకి వెళ్లి, వస్తూ విధులు నిర్వహిస్తూ ఉంటుందని క్యూ లైన్‌లో ఉన్న తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ కనీసం పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ఎవరైనా

విద్యుత్ బిల్లుల కౌంటర్ వద్ద వేచి ఉన్న విద్యుత్ వినియోగదారులు

ప్రశ్నిస్తే విద్యుత్ సంఘాల అధికారుల అండ తనకు ఉందని, తనను ఎవరూ చేసేది ఏమీ లేదని దురుసుగా ప్రవర్తిస్తుందని పలువురు చెబుతున్నారు. విద్యుత్ సిఎండి పనిభారాన్ని బట్టి పలు విద్యుత్ కార్యాలయాల్లో సీట్ల సర్దుబాటు చేస్తుంటే ఆమదాలవలస సబ్ ఇఆర్ఒలో మాత్రం అందుకు భిన్నంగా ఉండడంపై పలువురు చర్చించుకుంటున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

ఒక మహిళా ఉద్యోగి కోసం విధుల్లో వెసులుబాటు కల్పించడానికి జిల్లాస్థాయి అధికారులు పూర్తిమద్దతు ఇస్తుండడంతో సదరు ఉద్యోగిని ఇఆర్ఒ ఎఎఒ ఉత్తర్వులను కూడా బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని తోటి ఉద్యోగులే చెబుతున్నారు. జిల్లా ఎఎఇ ఉత్తర్వుల ప్రకారం సదరు ఉద్యోగి నవంబర్ నెలలో జిఆర్‌సి కౌంటర్ సబ్ ఇఆర్ఒ ఆఫీసు నందు విద్యుత్ బిల్లులు వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆమె ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా తనకు నచ్చిన విధంగా జిల్లాస్థాయి అధికారులు, యూనియన్ నాయకుల అండదండలతో పనిలేని సీటుకు మాత్రమే పరిమితమై కాలయాపన చేస్తూ తోటి ఉద్యోగులను దూషిస్తూ ఉద్యోగులందరితో వాదనలకు దిగుతూ వికృత చేష్టలకు పాల్పడుతుందని, ఆమెతో విధులను నిర్వర్తించలేకపోతున్నామని తోటి ఉద్యోగులే చెబుతుండడం విశేషం. పలుమార్లు ఆమె ప్రవర్తన దుశ్చర్యలపై విద్యుత్ విజిలెన్స్‌శాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు ఉద్యోగినిపై క్రమశిక్షణా చర్యగా ఒక ఇంక్రిమెంట్ కోత విధించినప్పటికీ ఆమె ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని పలువురు చెబుతున్నారు. కొద్ది రోజుల తరువాత అదే కార్యాలయంలో పనిచేస్తున్న తోటి ఉద్యోగినితో గొడవకు దిగి కార్యాలయంలో రచ్చరచ్చ చేయడంతో పోలీసు, విజిలెన్స్, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి మరలా విచారణ చేసి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సంఘటన జరిగి చాలా కాలం జరిగినప్పటికీ ఇంతవరకూ విద్యుత్ అధికారులు ఆమెపై ఎటువంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇటీవల ఆమెపై విచారణ జరిపి, షోకాజ్ నోటీసు కూడా ఇచ్చినట్లు సమాచారం. అప్పటి ఎఎఒ., ఇఆర్ఒ సబ్ ఇఆర్ఒ ఇక్కడ అధిక సంఖ్యలో సిబ్బంది ఉన్నారని, వారిని వేరేచోట వినియోగించాల్సిందిగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు లిఖితపూర్వకంగా విన్నవించినప్పటికీ ఇటీవల జరిగిన బదిలీల్లో ఆ మహిళా ఉద్యోగినికి ఉద్యోగ విధుల నుంచి వెసులుబాటు కల్పించడానికి అవసరం లేకున్నా అదనపు సిబ్బందిని నియమించడంలో ఆంతర్యమేమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. పని ఒత్తిడి ఉన్న శ్రీకాకుళం ఇఆర్ఒ నందు ఎస్ఇఆర్‌సి వంటి కీలక స్థానాలు ఖాళీగా ఉండగా ఆమదాలవలసకు ఉద్యోగులను బదిలీ చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆమదాలవలస ఇఆర్ఒపై దృష్టిపెట్టి ఉద్యోగులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'ప్రజా పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ఎచ్చెర్ల : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ప్రజా సమస్యలపై నవంబర్ 8 నుంచి 14 వరకు సిపిఎం ఆధ్వర్యంలో జరుగనున్న ప్రజాపోరులో భాగంగా నవంబర్ 14న ధర్నాలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.వి. రమణ పిలుపునిచ్చారు. బుధవారం మండలం అరిణామ అక్కివలస జంక్షన్ వద్ద ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, టమోటా వంటి నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్నంటాయన్నారు. ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, ఇలాంటి అదనపు భారాలు మోపటం సరికాదన్నారు. తక్షణమే ఈ నోటిఫికేషన్ ఉపసంహరిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు ఎం.అశోక్, ఎల్.నాగరాజు, జె.సురేష్, పి.శ్రీనువాసరావు, ఎం.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : విద్యుత్ ట్రూఆఫ్ ఛార్జీల వసూలును ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ప్రజాపోర్టు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, ఉర్జాన లక్ష్మణరావు, ఉర్జాన మాధవ రావు, బగాది వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: విద్యుత్ ట్రా ఆఫ్ ఛార్జీల వసూలు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం నాయకులు బి.ఆనందరావు డిమాండ్ చేశారు. మండలంలోని నగరంపల్లిలో ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్.మోహనరావు, టి.భాస్కరరావు, బి.రామకృష్ణ, సుగుణవతి, బి.లక్ష్మి, టి.లక్ష్మి, బి.హిందుమతి, టి.యశోద పాల్గొన్నారు.

అసెంబ్లీలో చర్చ శుభపరిణామం

ప్రజాశక్తి - రణస్థలం

మాట్లాడుతున్న అమ్మోజీ

అసెంబ్లీ సమావేశంలో మహిళా పోలీసుల అంశం చర్చకు రావడం రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులకు మంచి జరగనుందని మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బమ్మిడి అమ్మోజీ ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహిళా పోలీస్‌ల డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన విధివిధానాలు, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ కొంతమంది ఎమ్మెల్యేలు, హోంమంత్రి చర్చించడం వల్ల త్వరితగతిన తమ సమస్యలకు పరిష్కారం దొరకనుందన్నారు. తమకు అధికారులు కేటాయించిన అన్ని విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ లైన్ డిపార్ట్‌మెంట్, ప్రత్యేకమైన జాబ్‌చార్ట్ లేకపోవడం వల్ల క్షేత్రస్థాయిలో ఇబ్బందికి గురవుతున్నామన్నారు. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో తమకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొట్లాట కేసులో ఆరుగురు అరెస్టు

రణస్థలం రూరల్ : జి.సిగడాం గ్రామంలో ఇటీవల జరిగిన భూ వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో నాయిన సూర్యనారాయణ, వెంకటరావును అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపర్చడం పాఠకులకు విధితమే. బుధవారం జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం విలేకరుతో మాట్లాడుతూ జి.సిగడాం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 11921 లో 33 సెంట్లు కోర్టు వివాదంలో ఉన్న భూమిపై సోమవారం అదే గ్రామానికి చెందిన నాయిన శివన్న, ఎన్.లక్ష్మణరావు, ఎన్.సీతంనాయుడు, ఎన్ శకంతరావు, ఎన్.గోపి, ఎన్ రాజు నీరు కట్టే ప్రయత్నం చేశారని, కోర్టు వివాదం ఉన్న భూమిపైకి ఎందుకు వచ్చారని ప్రశ్నించిన నాయిన సూర్యనారాయణ, వెంకటరావులపై విచక్షనా రహితంగా సదరు ఆరుగురు వ్యక్తులు కత్తులు, కర్రలతో దాడికి పాల్పడ్డారని తెలిపారు. బాధితుల తలపై, శరీరం మీద తీవ్ర గాయాలయ్యాయని స్పష్టం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూధనరావు బుధవారం ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి, జి. సిగడాం ఎస్ఐ మధసూధనరావు ఉన్నారు.

అసెంబ్లీలో గిరిజన సమస్యలపై ప్రస్తావన

ప్రజాశక్తి - పలాస

అమరావతిలో నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాలలో బుధవారం ఎమ్మెల్యే గౌతు శిరీష గిరిజన సమస్యలపై ప్రస్తావించారు. 2014 నుంచి 19 వరకు గిరిజనులకు అప్పటి టిడిపి ప్రభుతం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. అనంతరం అధికారంలోనికి వచ్చిన వైసిపి ప్రభుత్వం పథకాలకు పేర్లు మార్పు చేసిందే తప్ప అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ గిరిజనులు తాగునీటి కోసం కిలోమీటర్లు దూరం వెళ్లి, తెచ్చుకోవలసిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వం ఐటిడిఎను, గిరిజన పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. కనీసం పౌష్టకాహారం కూడా అందని పరిస్థితి ఉన్నాయని అన్నారు. అందువల్ల ఆయా ప్రాంతాలను మళ్లీ ఐటిడిఎ సౌకర్యం కల్పించాలని కోరారు.

పిటిపిసి కార్యాలయంలో శిరీషకు సన్మానం

అమరావతిలో నిర్వహిస్తున్న అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష విజయవాడలోని ఎపిటిపిసి కార్యాలయాన్ని సందర్శించారు. తొలిసారిగా ఎమ్మెల్యే వెళ్లడంతో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

టోల్ ఫ్రీ నంబరుతో విద్యుత్ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేస్తే తక్షణమే విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ఎపిఇపిడిసిఎల్ సిజిఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంతి జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో, ఇచ్ఛాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వినియోగదారులతో విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు విద్యుత్ వినియోగం, సమస్యలు ఎదురైన సమయంలో ఏవిధంగా ఫిర్యాదులు చేయాలి, టోల్ ఫ్రీ నంబరుకు ఏ విధంగా ఫిర్యాదు చేయాలన్న అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపాలిటీ, మండల పరిధిలోని 11 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో విద్యుత్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సాంకేతిక 34 సభ్యులు షేక్ బాబర్, ఇఇ విఘ్నేశ్వరరావు, ఎఇ గోవిందరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్‌కుమార్ పాడి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

మంత్రి తీరుపై 'తమ్ముళ్ల' అసహనం

ప్రజాశక్తి - టెక్కలి

వ్యవసాయశాఖ మంత్రి టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవహారశైలిపై తెలుగు తమ్ముళ్లు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. మూడో విడత నామినేటెడ్ పదవుల పందారంలో టెక్కలి మండలానికి, టెక్కలి నియోజకవర్గానికి సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై వారు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. టెక్కలి మండలంలోని టిడిపి మండల అధ్యక్షుడు బగాది శేషగిరికి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం అసహనానికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. శేషగిరి రాజకీయ జీవితం ఆరంభం నుంచీ టిడిపికే అంకితమయ్యారు. ఇటువంటి క్రమంలో ప్రతి ఎన్నికల్లోనూ టెక్కలి మండలంలో టిడిపి ఓట్లు శాతం పెంపుదలలో కీలకపాత్ర వహించారు. అలాంటి నాయకుడికి నామినేటెడ్ పదవి కట్టబెట్టడంలో మంత్రి వ్యవహరించిన తీరు తమ్ముళ్లకు ఆగ్రహాన్ని కల్పిస్తుంది. కాళింగులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం కూడా ఇందులో భాగంగా పరిశీలిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం పదవుల పందారం వెలువబడినప్పటికీ సరైన ప్రాధాన్యత కల్పించకపోవడంతో బుధవారం తమ్ముళ్లు రహస్య సమావేశాన్ని నిర్వహించినట్లు సమాచారం. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని కొందరు కొందరు వ్యతిరేకిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలు కేసులకు గురై రౌడీషీటర్‌గా నమోదైన వ్యక్తులకు ప్రాధాన్యత కల్పించడంలో మంత్రి తీసుకునే నిర్ణయాలు బాధాకరంగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మంత్రి మెజార్టీకి టెక్కలి మండలం కీలక పాత్ర పోషించింది. ఇటువంటి క్రమంలో నామినేటెడ్ పదవులు కట్టబెట్టడంలో మొదటి విడతలోనే ప్రాధాన్యత కల్పించాల్సి ఉన్నప్పటికీ మంత్రి ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం ఒకింత తమ్ముళ్ల మధ్య అసహనానికి కారణం. కాగా, ప్రస్తుతం కేటాయించిన పదవీ సరైనది కాకపోవడం కాళింగ సామాజిక తరగతులను కించపరిచే విధంగా వ్యవహరించారని తమ్ముళ్లు మదనపడుతున్నారు. నియోజవర్గంలో ప్రతి చిన్న కార్యక్రమానికీ తమ్ముళు మంత్రి వెంటే ఉండి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ సరైన ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై వారు కినుక వహిస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి పదవల కట్టడంలో తమ్ముళ్లకు న్యాయం చేస్తారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారుతుంది.

హెటిరో క్యాంపస్‌కు విద్యార్థుల ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల లో ప్రముఖ ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఈ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కాకినాడ ఆదిత్య కళాశాల డిగ్రీ విద్యార్థులు 55 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీతో పాటు ఉద్యోగం సాధించే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నామని, ప్రస్తుతం 5వ సెమిస్టరులో ఉండగానే ప్రముఖ బహుళ జాతి సంస్థ హెటిరోలో ఉద్యోగం సాధించడం అభినందనీయమని, వీరికి సంవత్సరానికి రూ.3 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ సుగుణా రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ మొదట సంవత్సరం నుంచే క్యాంపస్ ఇంటర్వ్యూలకు తగిన శిక్షణ అందిస్తున్నామని, తద్వారా వారు వివిధ కంపెనీల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక అవుతున్నారని తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ బి.యస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.జి.వి.సుబ్రహ్మణ్యం, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆర్.రాజు, ఆధ్యాపక బృందం ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అభినందిస్తున్న చక్రవర్తి

క్రీడల్లో మరింత రాణించాలి

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

క్రీడల్లో మరింత రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ అన్నారు. నవంబర్ 9 నుంచి 11 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీలో యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న ఎం.మౌనిక, ఎస్.జీవిత పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబర్చి త్వరలో జాతీయస్థాయిలో జరగనున్న ఎస్‌జిఎఫ్ వాలీబాల్ పోటీల్లో సెలెక్టవ్వడంతో డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఇంగ్లీష్ విభాగపతి నూకేష్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు, విశ్వనాథ్ బిసై, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో పతకం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రస్థాయిలో నంద్యాలలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఇంటర్ విద్యార్థిని ముంత గాయత్రి మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఆమె సీనియర్స్ తరపున జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని చైతన్య సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జామి భీమాశంకర్, ప్రిన్సిపాల్ రౌతు శ్రీనివాసరావు, వి.టి.నాయుడు, సంపత్‌కుమార్, కిరణ్‌లు అభినందించారు.

అభినందిస్తున్న భీమశంకర్

'యువ ఉత్సవ్'లో యోషితకు ద్వితీయ స్థానం

శ్రీకాకుళం అర్బన్ : కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాది చదువుతున్న ఎస్.బిందు యోషితకు నెహ్రూ యువ కేంద్రం జిల్లాస్థాయిలో మంగళవారం నిర్వహించిన యువజన ఉత్సవ్ పోటీల్లో రెండో స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆమెను బుధవారం కళాశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ శంకర్‌లు అభినందించారు. యువతీ, యువకుల్లో నైపుణ్యతలను, మెళకువలను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహద పడతాయన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలన్నారు. దీనివల్ల భవిష్యత్ లో మంచి ఫలితాలను అందుకోగలరన్నారు. యోషిత గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ సాయంతో చదువుతూ, జిల్లా కీర్తిని, కళాశాలకు, గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్‌కు మంచి పేరు తెచ్చిందని వారు తెలిపారు.

సమస్యల పరిష్కార వేదికపై శిక్షణ

ప్రజాశక్తి - పలాస

ప్రతి సోమవారమూ తహశీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికపై డివిజన్‌స్థాయి తహశీల్దార్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఆర్‌డిఒ డి.వెంకటేష్ బుధవారం శిక్షణఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో ఫిర్యాదులు ఎలా స్వీకరించాలి... వాటిపై ఎలా విచారణ చేపట్టాలి... ఎలా సమస్యలు పరిష్కరించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుకూ తక్షణమే పరిష్కారం చూపే విధంగా తహశీల్దార్లు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పలాస తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

పారిశుధ్య పనులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. పలాస-కాశీబుగ్గ ప్రాంతాల్లో పారిశుధ్య విభాగానికి చెందిన నిరుపయోగంగా పడి ఉన్న పనిముట్లకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో పారిశుధ్య పనులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. పనిముట్లకు మరమ్మతులు చేపట్టడం ద్వారా పారిశుధ్య పనులు చేపట్టడానికి వీలుగా ఉంటుందన్నారు. రోజూ పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు. ఆయనతోపాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటు మృతి ఘటనపై విచారణ

పొందూరు: జి.సిగడాం మండలం చెట్టుపొదిలాంకు చెందిన కొళ్ల నారాయణరావు 2023 సెప్టెంబర్ 16న పొలంలో పాముకాటుకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు పొందూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. అప్పుడు విధులు నిర్వహిస్తున్న వైద్యులు చికిత్స ప్రారంభించారు. చికిత్స చేస్తూ మధ్యలో వైద్యురాలు ఇంటికి వెళ్లిపోయారు. దీంతో పాముకాటుకు గురైన రోగికి సరైన వైద్యం అందక పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి సిబ్బంది శ్రీకాకుళం తరలించాలని సూచించారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లిన కొద్ది నిమిషాలకే పాముకాటుకు గురైన నారాయణరావు మృతి చెందాడు. దీనిపై నారాయణరావు కుమారుడు కొళ్ల చక్రపాణి ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశాడు. 2023 అక్టోబర్ 13న అప్పటి డిహెచ్ఎస్ భాస్కరరావు విచారణ చేపట్టారు. అక్టోబర్ 20న నరసన్నపేట సామాజిక ఆస్పత్రి సివిల్ సర్జన్ శ్రీనుబాబు శాఖాపరమైన విచారణ చేపట్టారు. ఇద్దరు విచారించినా ఎటువంటి చర్యలు లేకపోవడంతో బాధిత కుటుంబానికి చెందిన చక్రపాణి గత నెల 17న విచారణ ఏమైంది, చర్యలు ఏమిటని డిసిహెచ్‌ఒకు ఫిర్యాదు చేశాడు. దీంతో మరలా బుధవారం పొందూరు సామాజిక ఆస్పత్రిలో పాలకొండ ఏరియా ఆస్పత్రి సూపరెంటెండెంట్ నాగభూషన్ ఆధ్వర్యంలో ఆ సంఘటనకు సంబంధించి అప్పటి వైద్యాధికారులు, సిబ్బందిని, మృతుని కుటుంబ సభ్యులను విచారణ చేపట్టారు. దీంతో విచారణలే మిగిలుతున్నాయే తప్పా దీనిపై స్పష్టమైన నివేదికలు అందజేసి చర్యలేవి చేపట్టట్లేదు అంటూ బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తున్న నాగభూషణ్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లావేరు: మండలంలోని అదపాక గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త గొర్లె అర్జునరావు తల్లి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, మాజీ ఎంపిపి డి.రాజానాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, మాజీ సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, ప్రభాకర్, ఎంపిటిసి గంట్యాడ సత్యం, కిల్లారి మధు తదితరులున్నారు.

పరిశీలిస్తున్న ఎంఇఒ లింగరాజు

'అపార్' నమోదు వేగవంతం

పోలాకి: ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అపార్ నమోదు వేగవంతం చేయాలని ఎంఇఒ-2 టి.లింగరాజు ఆదేశించారు. మండలంలోని పిర్యాగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అపార్ నమోదును బుధవారం పరిశీలించారు. ఎంత మంది విద్యార్థుల డేటా నమోదు చేశారు, చేసేటప్పుడు ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్న అంశాలను పరిశీలించి వాటిని నివారణకు తగు సూచినలు చేశారు. ఇంకా మండలంలో 2003 మంది విద్యార్థుల డేటా నమోదు చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వరరావు, గోపి, రామకృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

బూర్జ: ప్రతిఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని ఎస్ఐ ప్రవళ్లిక అన్నారు. బుధవారం తోటవాడ గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. మైనర్లు వాహనాలు నడుపరాదని, మైనర్లు వాహనాలు నడపడం నేరమన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనదారులు వాహనాలు నడుపరాదన్నారు. ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపరాదన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ ప్రవళ్లిక

బడ్జెట్‌లో మహిళలకు మోసం

ప్రజాశక్తి- పాతపట్నం

రెడ్డి శాంతి, మాజీ ఎమ్మెల్యే

టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజలను, మహిళలను మోసం చేసేలా ఉందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. ఈ మేరకు తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మహశక్తి 19-59 ఏళ్ల మహిళలకు ప్రతినెలా రూ.1,500 ఇస్తామని హామీ, తల్లికి వందనం పేరుతో రూ.20 వేలు, 20 లక్షల ఉద్యోగాల ఊసేలేదన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు కోసం ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి బడ్జెట్‌లో ఎక్కడా ప్రతిబింబించలేదని, భారీగా అప్పుల మోత, అప్పుల వాతలు మాత్రం కనిపిస్తుందని వ్యాఖ్యానించారు.

'అపార్' సమస్యలపై కలెక్టర్‌కు లేఖ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులకు అపార్ ఐడి క్రియేట్ చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి ఒత్తిడిని తగ్గించడానికి సమయాన్ని పెంచాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్.వి.అనిల్ కుమార్ కోరారు. బుధవారం సంఘం తరపున జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు లేఖ రాశారు. ఉపాధ్యాయుల నియంత్రణలో లేని అంశాలపై లక్ష్యాలను నిర్దేశించి వేధింపులకు గురి చేయడం తగదన్నారు. ఒత్తిడి వల్ల తరగతుల్లో జరగాల్సిన బోధనకు ఆటంకం కలిగి విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని వారు లేఖలో పేర్కొన్నారు. స్కూల్ రికార్డులకు, ఆధార్‌కు మధ్య వ్యత్యాసాలు వస్తున్నందున అపార్ ఐడి రావడం లేదని, తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడం వల్ల ఈ అంశాలపై అవగాహన లేక పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరగలేమని చెబుతున్నారని గుర్తు చేశారు. స్కూల్ రికార్డుల్లో తప్పులు లేకున్నా ఆధార్‌లో తప్పుల వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచడం సరికాదన్నారు. సమస్యలను పరిగణనలోకి తీసుకొని పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐటెప్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్య కార్యక్రమం (ఐటెప్) లో మిగులు సీట్లకు తక్షణ ప్రవేశాలను (స్పాట్ అడ్మిషన్స్) డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించనుంది. గురువారం నుంచి ఈ ప్రవేశ ప్రక్రియ మొదలు కానుంది. బిఎస్సి, బి.ఇడి, బి.ఎ, బిఇడి కోర్సుల్లో సీట్ల భర్తీకి ఈ ప్రవేశాలు జరగనున్నాయి. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ మండలి-2024 స్కోర్‌కార్డు పొందిన వారు ఈ ప్రవేశాలకు అర్హులని యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.అనూరాధ తెలిపారు. విద్యార్థులు, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, అర్హత ఫొటోలతో నేరుగా యూనివర్సిటీలోని తమ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా కోర్సుకు సంబంధించిన ట్యూషన్ ఫీజును ప్రవేశం పొందిన సమయంలోనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. సీట్లు పొందిన వారు ఎటువంటి ప్రభుత్వ ఉపకార వేతనాలకు అర్హులు కారని ప్రిన్సిపాల్ తెలిపారు.

రైతులకు దన్నుగా రాష్ట్ర బడ్జెట్

ప్రజాశక్తి- టెక్కలి

కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు దన్నుగా ఉందని టెక్కలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. రైతు బిడ్డగా జన్మించిన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బడ్జెట్‌లో వ్యవసాయానికి వెచ్చించిన నిధులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, రబీ సీజన్‌లో కావాల్సిన పంటకు అవసరమైన విత్తనాలు అందిస్తున్నారని ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. రుణాలు అందివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నారన్నారు. బడ్జెట్ సమావేశానికి ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి ముఖం చాటేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ఆముదాలవలస నియోజకవర్గానికి చెందిన జనసేన ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావుకి డైరెక్టర్‌గా నియమించడంపై అభినందనలు తెలిపారు. ఈయనతో పాటు జనసేన నాయకులు బుద్ధ గవరయ్య, కుమారస్వామి, త్రివేణి భాస్కర్, రమణ, రమేష్, హరి ఉన్నారు.

పాతపట్నం : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లావణ్య

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి- పలాస

ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని రెంటికోటలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మును మత్తు పదార్థాల వినియోగించడం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నం కానున్నాయన్నారు. గంజాయి, నాటు సారా వంటి మత్తు పదార్థాల విక్రయాలు ఎక్కడ చేపట్టినా పోలీసుల సమాచారం అంద జేయాలన్నారు. గంజాయి, నాటుసారా విక్రయాలపై నిఘా పెట్టామన్నారు.

పాతపట్నం : విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. స్థానిక కిర్లంపూడి జూనియర్ కళాశాలలో బుధవారం అవగాహన కల్పించారు. వాటివల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాల పరిస్థితులను వివరించారు. విద్యార్థులు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎపిఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షునిగా 'మజ్జి'

చిన్నబాబు

వజ్రపుకొత్తూరు: నూతనంగా ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన మజ్జి చిన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని శంకరమఠం హాలులో నిర్వహించిన సమావేశంలో అడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం బుధవారం రాష్ట్ర అధ్యక్షులు కాడికెళ్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావులు చినబాబును ఉపాధ్యక్షునిగా ప్రకటించారు. అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఈయన ప్రస్తుతం వజ్రపుకొత్తూరు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ బాధ్యత, భవిష్యత్ నినాదంతో సంఘం స్థాపించామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాల పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ముందు వరుసలో ఉంటామని తెలిపారు.

హౌసింగ్ గ్రీవెన్స్‌కు 18 దరఖాస్తులు

వినతులను స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి, టిడ్కో ఇళ్ల కేటాయింపులకు సంబంధించి 18 దరఖాస్తులు అందాయి. ముఖ్యంగా అర్బన్ లే అవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు, ఇసుక వంటి సమస్యలపై దరఖాస్తు చేసుకున్నారు. సమస్యలను వివిధ శాఖాధికారులతో స్వయంగా మున్సిపల్ కమిషనర్ ఎన్ రామారావు మాట్లాడి పరిష్కరించారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఇంకా టిడ్కో ఇళ్లకు సొమ్ము డిపాజిట్ చేసిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్బన్ హౌసింగ్‌కి సంబంధించిన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై ఎలాంటి సమస్యలు ఉన్నా తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

వృద్ధుల సంరక్షణ పిల్లల బాధ్యత

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

వృద్ధుల సంరక్షణ వారి పిల్లల బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. తల్లిదండ్రులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం నేరమన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో వికలాంగులు, వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన వృద్ధుల పోషణ, సంరక్షణపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2007లో వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాన్ని అనుసరించి తల్లిదండ్రులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ చట్టంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత చర్చ జరగాలన్నారు. చట్టంపై అవగాహన కలిగించడం ద్వారా వృద్ధుల సంరక్షణ, పోషణపై వారి బాధ్యత పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత వల్ల చట్టం ప్రాధాన్యత తెలియక వృద్ధులు నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. సదస్సులో వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి కె.కవిత, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి నర్తు కళ్యాణ్‌బాబు, రిమ్స్ ఆస్పత్రి మానసిక వైద్య నిపుణులు అఖిల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, పి.మల్లిబాబు, రిటైర్డ్ డిఇఒ బలివాడ మల్లేశ్వరరావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో జిల్లాకు పతకాల పంట

24 పతకాలతో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

క్రీడాకారులను అభినందిస్తున్న ప్రతినిధులు

రాజమండ్రిలో ఈనెల పదో తేదీన నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. గోదావరి స్విమ్మింగ్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు 21 స్వర్ణ, ఒక రజత, రెండు కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. పుక్కళ్ల సత్యరాజు నాలుగు స్వర్ణ, జి.సహదేవుడు నాలుగు, డి.ప్రకాశరావు నాలుగు, కిషోర్ రాకోటి మూడు స్వర్ణ పతకాలు, ఒక రజతం, డి.గణపతి రెండు స్వర్ణాలు, సిహెచ్.వెంకట్ రెండు కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బుక్కూరు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుప్పల వెంకటరావు క్రీడాకారులకు బుధవారం అభినందనలు తెలిపారు. డిసెంబరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి మరిన్ని పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి నౌపడ రాజారావు, కోచ్ షేక్ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి వివరిస్తున్న దుర్గారావు

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ సమస్యలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు కోరారు. ఢిల్లీలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా, ఉత్తరాంధ్రకు కావాల్సిన అభివృద్ధి, ఉద్దానం కిడ్నీ వ్యాధులు, గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్, తలసేమియా వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు రక్తమార్పిడి, కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన సంస్థ ఏర్పాటు కోసం చర్చించారు. ఉత్తరాంధ్రతో పాటు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

మాదిగల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగబద్ధంగా గడచిన దశాబ్దాల కాలం పాటు అభివృద్ధి చెందిన షెడ్యూల్ కులాలు అనుభవిస్తున్నాయని, అట్టడుగున ఉన్న మాదిగలకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో గడచిన మూడు దశాబ్దాలుగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ పోరాడుతున్నారని జాతీయ ఉద్యమ నాయకులు ఆలపాటి కరుణ అన్నారు. బుధవారం నగరంలోని పాత శ్రీకాకుళం హరిజన వీధిలో ఉన్న కమ్యూటీ హాల్‌లో ఉమ్మడి జిల్లా మాదిగ మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ మాదిగల భవిష్యత్ కోసం ఈ పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. పిల్లలకు విద్య, ఉపాధి, ఉద్యోగావకాశాలు సక్రమంగా సాధించుకునేందుకు విభజన తప్పనిసరన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు, రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు రానా శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి కంటిపాక హిమశేఖర్, నగర అధ్యక్షులు కానుకుర్తి గోవింద, ఎచ్చెర్ల తిరుపతి, గొంటి పోలయ్య, కురమాన భారతి, దాసరి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

పలాస : పలాస నియోజకవర్గం నుంచి మండలంలోని గురుదాసుపురం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, టిడిపి మండల అధ్యక్షులు కుత్తుమ్ లక్షణ కుమార్ అగ్నికుల క్షత్రిక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియాకమయ్యారు. మందస మండలం టిడిపి అధ్యక్షుడుగా ఉన్న భావన దుర్యోధన కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన పుచ్చ ఈశ్వరరావుకు కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకయ్యారు. వీరికి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకటచౌదరిని డైరెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముగ్గురికీ దుశ్శాలువ కప్పి సన్మానించారు.

బాలలతో పనిచేయించడం నేరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

18 ఏళ్లకంటే తక్కువ వయసు ఉన్న పిల్లలతో పని చేయించడం నేరమని లేబర్ ఆఫీసర్ వై.శైలేష్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు చైల్డ్ లేబర్ రిస్క్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వ్యాపార సముదాయాలు, మెకానిక్ షాప్‌లు, వెల్డింగ్ షాపులను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లకంటే తక్కువ వయసు ఉన్న పిల్లలతో పని చేయించడం నేరమని, అలా చేయించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమగ్ర శిక్ష ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ జనార్ధన మాట్లాడుతూ బడి బయట పిల్లలు ఎవరూ ఉండకూడదని, ప్రతిఒక్కరూ బడిలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ కె.శివాజీ, కౌన్సిలర్ ఎం.సునీత, ఎం.స్వర్ణలత, హెచ్‌డబ్ల్యుఒ సిఆర్ఎంటి మోహన్, బ్రెడ్స్ కెసిఎఫ్ఒ మాధవి, రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.కె.మదీనా, హెచఎం రామచంద్రరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మురళీధర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి- పొందూరు

సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మురళీధర్

మండలంలోని మలకాంకు చెందిన డాక్టర్ దున్నా మురళీధర్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు దక్కింది. విశాఖపట్నంలో డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడుగా పనిచేస్తున్నారు. ఈ నెల 11న ఉన్నత విద్యాశాఖ, వాణిజ్య శాస్త్రంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును విజయవాడలో ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రదానం చేశారు. మంత్రి నారా లోకేష్ తదితరులు పాల్గొన్నారు. మురళీధర్ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మలకాంలో చదువుకున్నారు. ఎపి రెసిడెన్షియల్ పాఠశాల ఎస్ఎంపురం, ఎపి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల వెంకటగిరి, డిగ్రీ కళాశాల నాగార్జున సాగర్, ఎంకాం ఆంధ్రాయూనివర్సిటీలో, ఎంఫిల్ మధురై కామరాజు విశ్వవిద్యాలయంలో, ఫరీదాబాద్‌లో గల లింగయ్య విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి పూర్తిచేశారు. తొలిసారిగా ఢిల్లీ యూనివర్సిటీలో అడాక్ ప్రాతి పదికన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆ తరువాత అమదాలవలస, జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేశారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని డాక్టర్ విఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఈ అవార్డు సాధించినందుకు మలకాం గ్రామస్తులు, స్నేహితులు తదితరులు అభినందించారు.

'ఆఫ్‌షోర్'పై చిన్నచూపు తగదు

మాట్లాడుతున్న వేణుగోపాలరావు

ప్రజాశక్తి- పలాస

ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ విమర్శించారు. కాశీబుగ్గ స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారి బడ్జెట్ ప్రవేశ పెట్టిందని, ఈ బడ్జెట్ రాజకీయ ప్రచార పోస్టర్లకే పరిమితమయ్యిందని అన్నారు. సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, కార్మికులు, కర్షకులకు ఎటువంటి ఉపయోగం లేదని ఉన్నారు. ముఖ్యంగా ఆఫ్‌షోర్ రిజర్వాయరుకు రూ.35 కోట్లు రిలీజ్ చేయడం అన్నది హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే ఆ ప్రాజెక్టు కింద పని చేసిన కాంట్రాక్టర్లకు, సబ్ కాంట్రాక్టర్లకు, నిర్వాసితులకు ఇవ్వాల్సిన బకాయిలు, 2015 భూ సేకరణ చట్టం ప్రకారం ఈ నిధులు సరిపోవన్నారు. ఇప్పటికే 20 సంవత్సరాల పూర్తయినా ఆఫ్‌షోర్ పని కూడా పూర్తి కాలేదన్నారు. గతంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ పోరాటం ద్వారా నిధులు తెప్పించినా ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉండి పోయిందన్నారు. శివాజీ వారసురాలుగా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తారని ప్రజలు నమ్ముతున్నారని, ప్రాజెక్టు పూర్తికి కావాల్సిన పూర్తి నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చాపర వేణుగోపాల్, సిహెచ్.రవి పాల్గొన్నారు.

ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ధర్నా చేస్తున్న నాయకులు

డిసెంబరు 4 విజయవాడలో నిర్వహించనున్న ప్రజాహక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ కళ్యాణచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పరిపాలనలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా... ఇచ్చిన హామీలు సంపూర్ణంగా అమలు కావడం లేదన్నారు. పలాసలో జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాన్నారు. జీడి పిక్కలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్‌కు నిధులు కేటాయించి ఇచ్ఛాపురం వరకు సాగు, తాగునీరు అందించాలన్నారు. పేదలందరికీ ఇళ్ల మంజూరు చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటను పునరుద్ధరించి ఆంధ్రులకు అంకితం చేయాలన్నారు. నూతన విద్యావిధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఏటా 15 లక్షలు ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.5 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. 200 రోజులు పాధి పనులు కల్పించి రూ.600 కూలి ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.35 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దిల రామారావు, వంకల అప్పయ్య, నాగేశ్వరరావు, రాపాక ముసలయ్య, పోతనపల్లి కామేశ్వరరావు, పోతనపల్లి అప్పారావు, కుత్తుం దుష్యంత్, జగదీష్, రామకృష్ణ, దేవరాజ్, హేమారావు పాల్గొన్నారు.

వరి పంట ముంపుతో రైతుల ఆందోళన



మజిలీపేట వద్ద పొలాల్లోకి చేరుతున్న కాలువ నీరు

ప్రజాశక్తి- పొందూరు

నారాయణపురం కాలువ పూడికలతో నిండిపోయి నిర్వహణ సక్రమంగా లేక కాలువల్లో నీరు పంటపొలాల్లోకి చేరుతోంది. దీంతో పంట చేతికొచ్చే సమయానికి పొలాల్లో నీరుచేరి వరిపంట దెబ్బతింటుందంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మజ్జిలపేట సమీపంలో నారాయణపురం కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కాలువ నిండా పూడికలు, పిచ్చిమొక్కలు పెరిగి కాలువ పూడిక పోయింది. కాలువలోకి కొద్దిగా నీరు చేరినా ఆ నీరు గట్లపైనుంచి పొలాల్లోకి చేరుతుంది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువ గట్లకు గండిపడి నీరు భారీగా పొలాల్లోకి చేరుతుండడంతో పంట మునిగిపోయి కుళ్లి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం మా పాలిట శాపంగా మారిందంటూ రైతన్నలు రోధిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పూడికలు తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విశాఖ ఉక్కును ప్రయివేటీకరించవద్దు

ప్రజాశక్తి- పలాస



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దానేష్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీ కరణపై మౌనాన్ని విడిచిపెట్టి స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పౌర హక్కుల సంఘం నాయకులు బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు తెలియ జేస్తున్నా... కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రను ఆదు కోవాలని కోరారు. వచ్చే ఏడాది జనవరి 25న నిర్వహించనున్న ఉద్యమంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి పిండి వెంకట్రావు, ఉపాధ్యక్షులు రామారావు, సహాయక కార్యదర్శి సోమనాథం, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మణ్, దున్న కృష్ణ, పూర్ణచంద్రరావు, జోగారావు, వైకుంఠరావు, ఢిల్లీరావు, దానయ్య పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శీతాకాలం దృష్ట్యా నగరంలోని గొంటివీధిలో గల పట్టణ పేదల నిర్మూలన వ్యవస్థలో (నైట్‌షెల్టర్) నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం సూర్యోదయాన మదర్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు, లైన్స్‌క్లబ్ సెంట్రల్ కార్యదర్శి డాక్టర్. పైడి సింధూర, మెంటర్ నటుకుల మోహన్‌లు దుప్పట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వస్త్రదానం మహాదా నమని, చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని పేదలకు దుప్పట్ల రూపంలో వస్త్రదానం చేయడం గొప్ప విషయమని, అందుకు మదర్స్ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధి డా.పైడి.ప్రదీప్ ముందుకు వచ్చి, మిత్రులు, దాతల సహాయంతో మంచి కార్యక్రమానికి పూనుకోవటం హర్షణీయమన్నారు. పలు ముఖ్య కూడళ్లలో ఉండే అభాగ్యులకు లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో దుప్పట్లను అందించే కార్యక్రమం నిర్వహిస్తామని, అలాగే వీరిని స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛంద సంస్థలు ముందు వస్తే, నిస్సహాయులు చలికాలంలో అనారోగ్య బారిన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో కెనడా జార్జ్, పొడుగు చరణ్, డా. పైడి ప్రదీప్, నైట్ షెల్టర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి సమావేశం వాయిదా

టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించాల్సిన మెగా పేరెంట్స్ దినోత్సవాన్ని వాయిదా వేశారు. నవంబరు 14న బాలల దినోత్సవం సందర్భంగా వాయిదా పడింది. ఈ సమావేశానికి పాఠశాలల ఉపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఆఖరి నిముషంలో అనివార్య కారణాల రీత్యా వాయిదా వేస్తున్నట్లు సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు ప్రకటించారు.

17న మెళియాపుట్టి మండల సమావేశం

మెళియాపుట్టి : ఈ నెల 17న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఎంపిపి రానా ఈశ్వరరమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొవాలని, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని సూచించారు.

ఉనికి చాటుకునేందుకే ఫిర్యాదులు

టెక్కలి: టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ ఇళ్ల పట్టాల వ్యవహారంపై చేసిన వ్యాఖ్యలు, ఫిర్యాదులు అర్థరహితమని, రాజకీయంగా తన ఉనికిని చాటుకోవడానికి చేసిన ఫిర్యాదులని టిడిపి నాయకులు హనుమంతు ఉదయ్‌భాస్కర్ అన్నారు. ఈ మేరకు తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో గుర్తించిన ఇళ్ల స్థలాలు, పట్టాలు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. అక్రమార్కులను అడ్డుకోవాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంలో వాస్తవం లేదన్నారు. వైసిపి హయాంలో ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పేదల పేర్లు చెప్పుకుని ఇళ్ల పట్టాలను తీసుకుని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కూరాకుల యాదవ్, టిడిపి సాంస్కృతిక విభాగం కార్యదర్శి ముడిదాన ఆనంద్‌కుమార్, యాగాటి పూర్ణ, జీవి రాజా పాల్గొన్నారు.

నీటిసంఘాల ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని 13 సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసిందని, రైతులు, సాగునీటి ఆయకట్టుదారులు గమనించాలని తహశీల్దార్ ఎన్ని జోగారావు బుధవారం తెలిపారు. మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 20న ఎన్నికలు నిర్వహించేందుకు అంతా సిద్ధంగా ఉండగా మళ్లీ ప్రభుత్వం నుంచి ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు తాజాగా ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి మరలా ఉత్తర్వులు వచ్చినప్పుడు ఎన్నికల వివరాలు తెలుపుతామన్నారు.

నేడు ప్రజాప్రతినిధులకు శిక్షణ

నందిగాం : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో మండలంలోని జెడ్‌పిటిసి, ఎంపిపి, ఎంపిటిసిలకు, సర్పంచ్‌లకు గురువారం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కరోజు శిక్షణలో జిపిడిపిపై నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

వికలాంగులకు ఫిజియోథెరపీ

ఇచ్ఛాపురం: స్థానికంగా ఉన్న ఎంపిఎల్‌పిఎస్, మూత్యాలమ్మ పేటలోని భవిత కేంద్రంలో బుధవారం ఫిజియో థెరపీ సేవలు నిర్వహించారు. 11 మంది వికలాం గులకు ఎచ్ఎంటి శివకుమార్, ఫిజియో థెరఫిస్టు బి. అమూల్య, ఫిజియో థెరపీ నిర్వహించారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు ఎస్.సూర్యం, సోమేష్, జి.అరుణ పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

పోలాకి: పోలాకిలో నేత్ర వైద్యాధికారి సాంబమూర్తి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించి నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరానికి సుమారు 70 మంది రోగులు పాల్గొన్నారు. వీరిలో 27 మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం విశాఖపట్నం రిఫర్ చేశారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలాకి ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పంటకోత ప్రయోగాలు

పొందూరు: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా వ్యవసాయ, గణాంకశాఖాధికారులు మండలంలోని ఇళ్లయ్యగారిపేట, రాపాకలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ పంటకోత ప్రయోగాల్లో ఎకరానికి 15,150 కేజీల వరిపంట దిగుబడి వస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రయోగాల్లో జిల్లా ముఖ్య గణాంకాధికారి విఎస్ఎస్ఎల్ ప్రసన్న, ఉప గణాంకాధికారి శ్రీదేవి, మండల ఎఒ బి.బాబ్జి, ఎఎస్ఒ శేఖర్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరామర్శ

లావేరు: మండలంలోని కొత్తకోటకు చెందిన తామాడ ఆదర్శ పాఠశాల ఇంటర్ విద్యార్థులు ఈనెల 11న పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వెళ్తున్న సమయంలో భీమునిపాలెం గ్రామం వద్ద ఆటోబోల్తా పడిన ఘటనలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నదుకుదిటి ఈశ్వరరావు కుమారుడు తేజాబాబు బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే గాయపడిన విద్యార్థులు గాయత్రి, శ్రావణి, సురేష్‌లతో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్యంపై వాకబు చేసి అండగా ఉంటామన్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. తేజాబాబు వెంట తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పుడి మురళీమోహన్, శివప్రసాదరావు, లంక నారాయణరావు, మీసాల త్రినాథరావు, రామారావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస: ఎస్‌టి పోస్టుమెట్రిక్ బాలుర వసతి గృహంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎస్ఎఫ్ఎస్ నాయకులు టి.ఎం.రాజు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్ వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. హాస్టల్‌లో సరైన వసతి సదుంయల లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తెలిపారు. 120 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో మరుగుదొడ్లు లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కుక్ సంఖ్య తక్కువగా ఉండడంతో విద్యార్థులకు సకాలంలో భోజనం అందడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై వార్డెన్ దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లిన ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగితే వార్డెన్ విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్. ధర్మారావు, పి.మధు, ఎన్.రాఘవేంద్ర, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి భరత్‌కు సన్మానం

పలాస: విజయవాడ అమరావతిలో భారీ పరిశ్రమలశాఖ మంత్రి భరత్‌ను ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. పరిశ్రమలకు స్థాపించడానికి అనువైన ప్రాంతం పలాస అని వివరించారు. ఇప్పటికే 200పైగా జీడి పరిశ్రమలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కొత్త వ్యక్తులు పరిశ్రమస్థాపనకు ముందుకు వస్తారని, పలాస ఎంఎస్ఎంఇలు మరికొన్ని చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి మీరు అవకాశం కల్పించాలని కోరారు.